సమాచారం




రేపు మానుకోటలో జాబ్ మేళా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి. రజిత మంగళవారం తెలిపారు. హైదరాబాద్ క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిరుద్యోగులైన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించుటకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్/ఐటీఐ విద్యార్హతలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండాలన్నారు. పురుష అభ్యర్థులైతే 18 నుంచి 28 సంవత్సరాలు, మహిళా అభ్యర్థులైతే 18 నుంచి 35 సంవత్సరాల వయసు మధ్య ఉండాలన్నారు. ఎంపిక కాబడిన ఉద్యోగులకు ఉచిత వసతి కల్పించబడునని తెలిపారు. అర్హత ఆసక్తిగల అభ్యర్థులు 24న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించు జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగులైన అభ్యర్తులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.ఇతర వివరాలకు సెల్ నెంబర్: 85230 98024ను సంప్రదించాలన్నారు.

అలసత్వం వహించారని..

- ముగ్గురు ఏఈవోల సస్పెన్షన్
- నేటి నుంచి సామూహిక సెలవులకు రంగం సిద్ధం



మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతు బీమా పథకంలో రైతుల మరణాలు ఆన్‌లైన్ నమోదు చే యడంలో ఆలసత్వం వహించారని సాకు చూపుతూ.. జిల్లాలో ముగ్గురు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు(ఏఈవో)లను సస్పెండ్ చేస్తూ మంగళవారం వ్యవసాయశాఖ డైరెక్టర్ ఉత్వర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 నుంచి 160 మంది ఏఈవోలను వ్యవసాయ శాఖ డైరెక్టర్ సస్పెండ్ చేశారని ఆరోపణలతో జిల్లాలో కలకలం రేపింది. దీంతో జిల్లాలోని ఏఈవోలు తొలుత రైతు వేదిక ముందు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేసిన అనంతరం మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయక సంచాలకులకు ఎ.శ్రీనివాస్ వద్దకు వెళ్లారు. ఆ సంఘటనకు నిరసనగా బుధవారం నుంచి జిల్లాలో ఏఈవోలు పనిచేయలేమని, సామూహిక సెలవులపై వెళ్లేందుకు నిర్ణయించారు. ఏఈవోలు సామూహిక సెలవు పత్రాలు ఏడీఏకు ఇవ్వడంతో సామూహిక సెలవులు ఇవ్వడం తమ పరిధిలో లేదని, జిల్లా వ్యవసాయాధికారి వద్దకు వెళ్లాలని సూచించారు. దాంతో ఏఈవోల జేఏసీ నాయకులు కలిసి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లి జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మలను కలవడానికి ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేదు. అయినప్పటికి బుధవారం నుంచి విధులకు తాము హాజరుకావడం లేదని ఏఈవోల జేఏసీ నాయకులు ప్రకటించారు. ఇటీవల డిజిటల్ క్రాఫ్ సర్వే చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో ఈ వివాదం మొదలైంది. తమపై 49 రకాల పనుల తీవ్రపనిభారం ఉందని, ప్రభుత్వం తీసుకువచ్చే ఈ సర్వేలో క్షేత్రస్థాయిలో ఎటువంటి సహాయకులు లేకుండ సర్వే నిర్వహించడం అసాధ్యమని, సహాయకులను ఏర్పాటు చేయాలని ఏఈవోల జేఏసీ చెబుతూ.. వచ్చింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధంగా సహాయకులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ డిజిటల్ సర్వేలో ఏఈవోలు రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొనడం లేదు. సర్వే చేయలేమని ఏఈవోలు మొండికేయడంతో రాష్ట్ర ప్రభుత్వానికి.. ఏఈవోల మధ్య వివాదం మొదలైంది. దాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ అధికారులు పరోక్షంగా ఏఈవోలపై రైతుబీమాలో రైతులు మృతి చెందితే డెత్ క్లెయిమ్ నమోదులో ఆలస్యం చేసి ఆలసత్వం వహించారని ఆరోపిస్తూ జిల్లాలోని ముగ్గురు ఏఈవోలను సస్పెండ్ చేశారు. దాంతో ఏఈవోలు మూకుమ్మడి సెలవులు పెట్టి నిరసన వ్యక్తం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.


మహబూబాబాద్ రైతు వేదిక ఎదుట నిరసన తెలుపుతున్న ఏఈవోలు

కుట్ర పూరిత చర్య



సీహెచ్.రాజు, ఏఈవోల జేఏసీ జిల్లా అధ్యక్షుడు

డీసీఎస్ యాప్ ఇనిస్టాల్ చేసుకోలేదని రైతుబీమా పేరుతో జిల్లాలో ముగ్గురిని, రాష్ట్ర వ్యాప్తంగా 160 మంది ఏఈవోలను సస్పెండ్ చేయడం కుట్ర పూరితమైన చర్య.

నోటీసులు ఇచ్చినా.. సస్పెండ్ చేశారు



మంగ శ్రీనివాస్, ఏఈవోల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

రెండురోజుల క్రితమే వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు శాంతియుత చర్చలకు సిద్దమని నోటీసు పంపడం జరిగింది. అయినప్పటికి జిల్లా, రాష్ట్రంలోని ఏఈవోలను సస్పెండ్ చేయడం బాధాకరం. ఇది సరికాదు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్




మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని పెరుమాండ్ల జగన్నాధం భవనంలో మల్లుస్వరాజ్యంనగర్ సీపీఎం శాఖమహాసభను మంగళవారం రావుల రాజు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ....దేశంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏడాది కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి దానిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పోరేట్ కంపెనీలకు కట్టబెడుతన్నారని మండిపడ్డారు. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని అందుకు ప్రజలు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరు ఐక్యంగా పోరాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల రాజు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, హేమానాయక్, చీపిరియాకయ్య, తోట శ్రీనివాస్, మచ్చ వెంకన్న పాల్గొన్నారు. కాగా మహబూబాబాద్ శివారు నున్నా నారాయణనగర్ 1,2,3 శాఖల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భం గా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అరుణపతాకాన్ని ఎగురవేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పంజాల ఉపేంద్ర, జంగా కళావతి, అనిత, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, సూర్నపు సోమయ్య, సమ్మెట రాజమౌళి, యాకయ్య, హేమానాయక్, నక్క సైదలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే షాపుల లైసెన్సులు రద్దు

డీఏవో విజయ నిర్మల


దుకాణాలను అకస్మికంగా తనిఖీ చేస్తున్న డీఏవో విజయ నిర్మల

గార్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, పురుగుమందులు విక్రయించే షాపు యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే షాపు లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ డీఏవో విజయ నిర్మల. హెచ్చరించారు. గార్ల వ్యవసాయ శాఖాధికారి కావటి రామారావుతో కలిసి మంగళవారం మండల కేంద్రంలోని ఎరువులు. పురుగు మందుల షాపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల షాపుల్లోని స్టాక్ రిజిస్టర్,బిల్ బుక్స్ ఇన్వాయిస్ లైసెన్స్ ఓ ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులకు ఎరువులు అమ్మేటప్పుడు బిల్లులపై రైతుల సంతకంతో పాటు షాపు నిర్వాహకుడి సంతకం తప్పక తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అనుమతి పొందిన విత్తనాలు, మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని ఆదేశించారు. రైతులకు ఆధార్ కార్డు ద్వారా ఈపాస్ మెషిన్ నుంచే ఎరువుల అమ్మకాలు జరపాలన్నారు. డీఏవో వెంట ఏవో కావటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సూది మందు.. ఆస్పత్రులకే
ఇవ్వాలి ముందు
బయ్యారం ఆస్పత్రిలో సిబ్బంది కొరత.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు 8

పట్టణ ప్రగతికి నిధులు మంజూరు

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మరిపెడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మరిపెడ పట్టణ ప్రగతికి అర్బన్ డెవలప్‌మెంట్ నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని పలు కాలనీలను సందర్శించి ఆయా కాలనీల వాసులతో మాట్లాడారు. ఎఫ్‌డీఐ నిధులతో పట్టణంలోని సీసీ రోడ్లు, సైడ్‌డ్రైనేజీ కాల్వలు, అంతర్గత రోడ్లను నిర్మించుకోవచ్చని తెలిపారు. ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు మునిసిపల్ అధికారులు అవగాహన కలిపించాలన్నారు. పట్టణ సుందరీకరణ కు శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దారు సైదులు, మునిసిపల్ కమిషనర్ వెంకట స్వామి, ఇంజనీర్లు ఉన్నారు.


మరిపెడ మున్సిపల్‌లోని పలు కాలనీలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కరెంట్ ఇష్యూ



మహబూబాబాద్‌లో అడ్డా వద్ద నిలిపిన ఆటోలు

- ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణికులు కరువు
- ఆర్థిక ఇబ్బందులతో ఫైనాన్స్.. వాహన కిస్తీల కోసం అప్పులు
- ప్రతి నెల ఆటో డ్రైవర్‌కు రూ.12 వేలు అందించాలని డిమాండ్
- హామీ అమలుకు నవంబరు 5న భారీ ధర్నాకు సమాయత్తం

ఆటోవాలా.. బతుకు డీలా!

కరోనా తర్వాత కోలుకోలేని స్థితిలో ఆటో డ్రైవర్ల జీవితాలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) ఆటోవాలాల జీవితాలు భారంగా మారాయి. తెల్లవారు జాము నుంచి రాత్రి చీకటి పడేంతవరకు పొద్దంతా కష్టపడ్డ పూట గడవడం కష్టంగా మారింది. నమ్ముకున్న ఆటో వృత్తిని వదులుకోలేక ఇతర వృత్తుల్లోకి వెళ్లలేక దానిపైనే ఆధారపడుతూ బతుకు బండిని లాగుతున్నారు బోరున వర్షం కురిసినా.. భానుడి ప్రతాపంతో మండు టెండలు కొట్టినా ప్రతి రోజు ఆటో చక్రం రోడ్డెక్కితేనే ఆ కార్మికుడి కుటుంబం కడుపునిండుతుంది. నిరుద్యోగం పెరిగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలులేక ఉన్నత చదువులు చదివిన యువకులు సైతం తమ కుటుంబాలను పోషించుకోవడానికి ఆటో వృత్తిని ఎంచుకుంటున్నారు. అయితే 2020 మార్చి వరకు ఆటో డ్రైవర్ల జీవితాలు బాగానే ఉన్నప్పటికి కరోనా మహమ్మరి ఒక్క సారిగా వారి జీవితాల్లో చీకటిని నింపింది. రెండేళ్ల పాటు లాక్‌డౌన్‌లతో ఆటో చక్రం రోడ్డెక్కక వారు ఆర్థికంగా చితికి పోయారు. 2022 వరకు కరోనా వ్యాప్తితో ఆటోలు అంతంతా మాత్రంగానే నడిచాయి. కాస్త కోలుకుంటున్న సమయంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణికులు కరువయ్యారు దాదాపు పది నెలలుగా ఆటో డ్రైవర్లు ఎటూ పాలుపోక ఆందోళన చెందుతున్నారు. తాము మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకం కాదని తమకు ఎన్నికల్లో సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతి నెల రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆటో సంఘాలన్ని ఏకమై జేఏసీగా ఏర్పడి నవంబరు 5న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నాకు సమయాత్తమవుతున్నారు. జేఏసీ నేతలు అన్ని జిల్లాలో పర్యటిస్తూ ఆటో డ్రైవర్లను పోరాటాలకు సంసిద్దులను చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నలమాస సాయి, తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జిల్లా అధ్యక్షుడు, ఆటో డ్రైవర్స్ జేఏసీ నేత

ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలి. రాష్ట్ర వ్యాప్తంగా 7.50 లక్షల మంది ఆటో డ్రైవర్లుండగా వారిపై 30లక్షల మంది కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పాలకులు ముందుకు రావాలి.

13 వేల ఆటోలు.. 50 వేల మంది ఆధారం..

జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలో సుమారు 15 వేలకు పై చిలుకు ఆటోలున్నాయి. దాదాపుగా 50 వేల మంది జీవనోపాధి ఆటోలపై ఆధారపడి ఉంది.. అందులో మహబూబాబాద్ పట్టణంలో 1700 వరకు ఉండగా, మిగతా ఆటోలు మండలాల పరిధిల్లో ఉన్నాయి. జిల్లా జనాభాలో సుమారు 8 శాతం మంది ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పక తప్పదు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన. హామీల్లో భాగంగా ప్రతి నెల రూ.12 వేల ను ఇవాల్సని, దీంతో పాటు ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని కోరుతున్నారు. ఆటో డ్రైవర్ల యూనియన్లు అన్ని కలిసి తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ (జేఏసీ)గా ఏర్పడి తమ హక్కుల సాధన ఉద్యమాలకు సంసిద్దులవుతున్నారు. ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ అంటేనే సంక్షేమం

- పని చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు
- హామీలను అమలు చేస్తున్నాం
- గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సీతక్క

ములుగు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అంటేనే సంక్షేమ పాలన అని, అప్పుల కుప్పను అధిగమిస్తూ హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బానోత్ రవిచందర్ ప్రమాణస్వీకార కార్యక్రమం ములుగులోని డీఎల్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగింది. రవిచందర్ చేత రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ ప్రమాణం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన పదినెలల్లోనే 60వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. దేశంలోనే తొలిసారి ఒకే దఫాలో రూ.2లక్షల పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. దీపావళిలోగా మరో 4లక్షల మందికి మాఫీ చేస్తామని, డిసెంబరు వరకు అర్హులందరికీ వర్తింపజేస్తామని వెల్లడించారు. పేద కుటుంబాలకు ఉచితంగా 200యూనిట్లలోపు విద్యుత్‌ను, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తున్నామని అన్నారు. డీఎస్సీ, గ్రూప్-1 నియామకాలకు బీఆర్ఎస్ కావాలనే అడ్డుపడిందని, కోర్టులో కేసులు వేసినప్పటికీ ఉపాధ్యాయ నియామకాలు పూర్తిచేశామని అన్నారు. గ్రూప్-1 పరీక్షలను దిగ్విజయంగా జరిపిస్తామని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేసే నాయకులకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. ములుగుకు అదనంగా ఏటూరునాగారంలో మార్కెట్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిబద్ధత గలవారికి రాబోయే రోజుల్లో నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యుల పాత్ర విలువైందని, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

గతంలో ప్రతిపక్షంలో ఉండి పోరాటం చేశామని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అభివృద్ధి చేద్దామని అన్నారు. అంకితభావంతో పనిచేసే నాయకులను గుర్తించకుంటే తనను నిలదీసే అధికారం ఉన్నదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సన్నద్ధం కావాలని అన్నారు. జిల్లాకు నూతనంగా స్పోర్ట్స్ స్కూల్ మంజూరైందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.300కోట్ల ఈజీఎస్ నిధులను విడుదల చేశామని తెలిపారు. ప్రజాసేవలతో తాను రెస్ట్ తీసుకోనని, నిత్యం ప్రజల మధ్యే ఉంటానని అన్నారు. కొన్నేళ్లుగా పార్టీ అభ్యున్నతికోసం పనిచేసిన పలువురు కార్యకర్తలు, నాయకులు మరణించారని, వారి కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండే బాధ్యత తనపై ఉందన్నారు. త్వరలోనే మండలాలవారీగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటుచేసి ఆ కుటుంబ సభ్యులకు భరోసానిస్తానని సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, టీపీసీసీ నేత కూచన రవళిరెడ్డి, పార్టీ ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, ఆయా మండలాలు, బ్లాక్‌ల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి సీతక్క

న్యూస్ బాక్స్



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

జనగామ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎంపికల్లో జిల్లా విద్యార్థులు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో అండర్-14, అండర్-17 విభాగంలో వాలీబాల్ క్రీడలకు జరిగిన ఎంపికల్లో ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-17 విభాగంలో 10వ తరగతికి చెందిన జె.వెంకన్న, జి.వినోద్, అండర్-14 విభాగంలో జె.తరుణ్(9వ), జి.గౌతమ్(7వ), బి.హుస్సేన్ (9వ), బి.కిరణ్(9వ) ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం జె.లచ్చిరాం, పీఈటీలు ఉపేందర్, ఉపాధ్యాయులు బి.వాసు, రత్నసింగ్, జయరాం, రాములు, రాజయ్య, సరోజన, స్వరూప, సారయ్య, పరమేశ్వర్, శత్రు, వీరన్న, హరిచంద్ అభినందించారు.

రెండోరోజూ పనిచేయని ఈ-నామ్

మ్యానువల్ టెండర్ విధానంలో కొనుగోళ్లు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్లలో రెండోరోజు మంగళవారం కూడ ఈ నామ్ సిస్టం పనిచేయ లేదు. దీంతో మంగళవారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ కార్యదర్శి శంషీర్ ఆధ్వర్యంలో పత్తి, మొక్కజొన్నలకు మ్యానువల్ టెండర్ విధానంలో వేలం పాటలు నిర్వహించారు. ధాన్యానికి బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డుకు 141 లాట్‌లు రావడంతో మ్యానువల్ టెండర్లు, బహిరంగ వేలం పాటల ద్వారా ఖరీదులు చేపట్టారు. కాగా, కేసముద్రం వ్యవసా య మార్కెట్‌కు 79 లాట్లలో ధాన్యం, మక్కలు, పెసర్లు, పత్తిని రైతులు తీసుకువచ్చారు. మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరరామలింగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఆ సరుకులకు మ్యాన్యువల్ టెండర్ విధానంలో కొనుగోళ్లు జరిపారు.

విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలి



అర్పనపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

ట్రాన్స్‌కో డీఈ విజయ్‌కుమార్

కేసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల వద్ద విద్యుత్ పరికరాలపై అవగాహనతో భద్రతాచర్యలు పాటించాలని ట్రాన్స్‌కో మహబూబాబాద్ డివిజనల్ ఇంజనీర్ పెరుమళ్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అర్పనపల్లిలో మంగళవారం 'విద్యుత్ శాఖ-పొలంబాట' కార్యక్రమంలో భాగంగా విద్యుత్ భద్రతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ విద్యుత్ మోటార్లు, ఉపకరణాలకు ఎర్తింగ్ ఏర్పాటు చేసుకుంటే విద్యుదాఘాతానికి గురికాకుండా ఉంటుం దని అన్నారు. వ్యవసాయ మోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసి ఉపయోగించి రైతులకు ప్రత్యక్షంగా వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఈ మచ్చ ఐలయ్య, ఏఈ కె.రాజు, ఎల్ఐ రవి, తిరుపతిరెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి

మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి మురళీధర్

తొర్రూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వైద్య సిబ్బంది సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో డివిజన్ పరిధిలోని వైద్య సిబ్బంది, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. అయోడిన్ లోపం రుగ్మతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు అయోడిన్ ఉప్పునే వాడాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

3 నెలలుగా సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి సేవలు అందించారన్నారు. సిబ్బంది సమష్టి కృషితోనే వ్యాధులను నివారించగలిగామని తెలిపారు. అసంక్రమిత వ్యాధులు, వ్యాక్సినేషన్, ఏఆర్‌వీ వ్యాక్సిన్‌ల కొరత లేకుండా చూడాలన్నారు. మాతా, శిశు సంక్షేమంలో భాగంగా గర్భిణులను గుర్తించి వంద శాతం నమోదు చేపట్టాలని, ఎనీమియా నివారణకు కృషి చేయాలన్నారు. 102 వాహనాలను ఉపయోగించుకుని గర్భిణీలకు మరిన్ని సేవలు అందించాలన్నారు. గ్రామాలతో పాటు పీహెచ్‌సీలలో పనిచేసే వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉండాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు సారంగం, నాగేశ్వర్‌రావు, సుధీర్‌రెడ్డి, కె.ప్రసాద్, రవీందర్, వైద్యులు మీరజ్, జ్వలిత, రవి, ప్రియాంక, నందనాదేవి, వనాకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మురళీధర్

ఐఆర్‌సీటీసీ స్పెషల్ టూరిజం ప్యాకేజీ

ఎగ్జిక్యూటీవ్ టూరిజం అధికారి పవన్ కుమార్

జనగామ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఐఆర్‌సీటీసీ ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడానికి తక్కువ బడ్జెట్‌లో ఐఆర్‌సీటీసీ స్పెషల్ టూరిజం ప్యాకేజీని ఇస్తునట్లు ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటీవ్ టూరిజం అధికారి పవన్ కుమార్‌సెంగర్ తెలిపారు. జనగామ రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ భారతదేశంలో యాత్ర స్థలాలకు ఎంతో ప్రాధాన్యముందన్నారు. భారత్‌గౌరవ్ ట్రైన్‌లో ప్రయాణికులకు రవాణా, వసతి, భోజనం లాంటి ఏర్పాట్లు చేయడం జరిగిందని, రక్షణ సిబ్బంది, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. శబరిమాల యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ అందిస్తుందని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి శబరిమలను భారత్ గౌరవ్ రైలు ద్వారా శబరిమల యాత్ర ప్యాకేజీ అందిస్తున్నామని తెలిపారు. నవంబరు 16న ప్రారంభమై నాలుగు రోజులు రాత్రులు, 5 రోజుల పర్యటన ఉంటుందన్నారు. జనగామ రైల్వే స్టేషన్‌లోనూ ట్రైన్ హాల్టింగ్ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో నరేశ్, మోటివేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

రెజ్లింగ్ జాతీయస్థాయి పోటీలకు అంజలి ఎంపిక

దుగ్గొండి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న బి.అంజలి రెజ్లింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని దన్వాడలో ఈ నెల3,4,5 తేదిలలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ క్రీడలలో పాల్గొని ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్ సాధించింది. నేటి నుంచి 27 వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ క్రీడల్లో అంజలి పాల్గొనడం జరుగుతుందని పాఠశాల ప్రత్యేక అధికారి మంజుల, పీఈటీ లావణ్య మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శానబోయిన రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి యాదగిరి సుధాకర్, కోశాధికారి కందికొండ రాజులు అంజలిని అభినందించారు.



మహదేవపూర్ ఏఈవో సస్పెన్షన్

మహదేవపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఏఈవో ధర్మేంద్ర సస్పెన్షన్‌కు గురయ్యారు. రైతు బీమాకు సంబంధించిన విధుల్లో ఆయన నిర్లక్ష్యం చేయడం వల్ల ఈమేరకు చర్యలు తీసుకున్నామని ఏడీఏ కె.పాల్ తెలిపారు. రైతుల వివరాలను నమోదు చేయడంలో అలసత్వం వహించారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలతో పాటు సాంఘిక, గిరిజన సంక్షేమ, మైనార్టీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెపిలించాలని కోరారు. త్వరలో పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న డీఏలను సంఘం ఆధ్వర్యంలో ఇప్పించేందుకు కృషి చేయడంతో పాటు 317 జీవోపై సుదీర్ఘ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కల్లెం వెంకట్‌రెడ్డి, గీత, హల్యానాయక్, రామోజీనాయక్, సుజాత, కీర్తనారెడ్డి, భవాని, సరిత, సుశీల, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ

క్రైం కార్నర్

కవి, రచయిత అరుణ్ గౌడ్ మృతి

గార్ల అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గార్ల మండల కేంద్రానికి చెందిన అభ్యుదయవాది, ప్రముఖ కవి, రచయిత బుడిద అరుణ్‌గౌడ్ (58)అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం ఖమ్మంలో మృతి చెందాడు. అరుణ్‌గౌడ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పలు కవి సమ్మేళనం పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో పలు బహుమతులు సొంతం చేసుకున్నారు. గార్ల మండలంలో వేట వేంకటేశ్వరస్వామి దేవాలయంపై పలు భక్తి పాటలు రచనలు చేసి సీడీ రూపంలో అందించడంతో ఎంతో పేరు సంపాదించుకున్నారు. గార్ల గ్రామ పంచాయతీలో 30 ఏళ్ల పాటు విధులు నిర్వహించి పేద ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి పట్టణ ప్రజల మన్ననలు పొందారు. అరుణ్‌గౌడ్ మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. గార్ల మేజర్ మాజీ ర్పంచ్‌లు అజ్మీరా బన్సీలాల్, గంగావత్ లక్ష్మణ్ నాయక్, పీఏసీఎస్‌చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, దనియాకులరామారావు, కందునూరి శ్రీనివాస్, కట్టెబోయిన శ్రీనివాస్ జితేందర్ కుమార్ అగ్రవాల్ తదితరులు ఉన్నారు.



అరుణ్ గౌడ్ (ఫైల్)

అనారోగ్యంతో చిన్నారి..

కేసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం సబ్‌స్టేషన్‌తండాలో గుగులోత్ హరి, కస్తూరి దంపతుల రెండేళ్ల కుమారుడు జయంత్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. వారికి ఒక కుమార్తె, కుమారుడు సంతానం. కొద్దిరోజులుగా బాబుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స చేయిస్తున్నారు. రాత్రి నిద్రించిన బాబు ఉదయం విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



జయంత్ (ఫైల్)

పాలకుర్తి ఎస్సై బదిలీ

యువకుడి ఆత్మహత్య నేపథ్యంలో వేటు

పాలకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) గిరిజన యువకుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నేపథ్యంలో పాలకుర్తి ఎస్సై సాయిప్రసన్నకుమార్‌ను వరంగల్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. అతని స్థానంలో డి.పవన్‌కుమార్‌ను ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భార్యాభర్తల వివాదంలో ఎస్సై తనకు న్యాయం చేయలేదని మండలంలోని కొండాపురం శివారు మేకలతండా చెందిన లాకావత్ శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఎస్సై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడటాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీస్ ఉన్నతాధికారులు అతడిపై వేటు వేశారు. ఎస్సైని సస్పెండ్ చేయాలని మృతుడి సంబంధికులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేసిన తరుణంలో ఎస్సై బదిలీ అనివార్యంగా మారింది.

ఏడు కిలోల గంజాయి పట్టివేత

ఖానాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధరావుపేట శివారు ఐనపల్లిలో ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. దుగ్గొండి సీఐ సాయిరమణ తెలిపిన వివరాల ప్రకారం ఖానాపురం పోలీస్‌లు మంగళవారం పెట్రోలింగ్‌లో భాగంగా బుధరావుపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఐనపల్లి ఐటీఐ కాలేజీ సమీపంలో ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తూ పోలీసులకు కనిపించారు. వారిని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం మారాయిగూడెంనకు చెందిన అప్కా నాగేశ్వర్‌రావు, చత్తీస్‌ఘడ్‌కు చెందిన నూప కృష్ణలుగా గుర్తించారు. వీరు చత్తీస్‌ఘడ్ నుంచి 7.760 కిలోల ఎండు గంజాయిని వరంగల్‌లో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మడానికి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 1.94లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రఘుపతి, పీసీలు వీరస్వామి, సుమన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

నేడు మేడారంలో హుండీల లెక్కింపు

మేడారం, అక్టోబరు 22 (ఆంధ్రజోతి): ములుగు తాడ్వాయి మండలం మేడారం వనదేవతలకు భక్తులు నాలుగు నెలలుగా సమర్పించిన కానుకల హుండీలను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు బుధవారం లెక్కించనున్నారు. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుందని మేడారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. మొత్తం 22 హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

- మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్
- పట్టణంలో పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి నెహ్రూ సెంటర్ మీదుగా కూరగాయల మార్కెట్, అంబేద్కర్ విగ్రహం వరకు మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ.. పోలీస్ సేవ సమాజంలో ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. ఏ సందర్భంలోనైనా ముందు వరుసలో ఉండేది పోలీస్ మాత్రమేనన్నారు. పోలీస్‌శాఖ మాత్రమే వ్యక్తిగతంగా ఎన్ని ఇబ్బందులు ఉన్న బయటకు కనబడకుండా ఎంతో మంది ఇప్పటికి విధులు నిర్వహిస్తూ ఉన్నారని చెప్పారు. వారి త్యాగాలను ఎప్పటికి మరిచిపోకూడదని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఓపెన్‌హౌజ్ క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరం, హెల్త్‌క్యాంపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు పెండ్యాల దేవేందర్, సర్వయ్య, ఎస్సైలు విజయ్‌కుమార్, దీపికరెడ్డి పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, పోలీస్ సిబ్బంది

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2420	2080
పల్లికాయ (సూక)	4400	4000
పల్లికాయ (పచ్చిది)	4650	4000
కందులు	---	---
పెసళ్లు	6030	4052
పత్తి	7010	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	12000	10000
పసుపు (గోల)	11500	10000
తేజ మిర్చి	12500	9000
తేజ ఏసీ	17500	12000
వండర్‌హాట్ ఏసీ	16000	11000
యూఎస్341ఏసీ	16500	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం


గుంటి చెరువులో ఏర్పాటు చేసిన ఉయ్యాలలు


గుంటి చెరువు వద్ద గొల్లరాజుల విగ్రహాలు


శివాలయంలో పేర్చిన నాటి విగ్రహాలు


ఇనుగుర్తి హైస్కూల్ గేటు పక్కన పడేసిన అమూల్యమైన శిల్ప సంపద

కాలగర్భంలో కలిసిన నగరం

కాకతీయుల కాలం నాటి సామంతుల రాజధాని కూడా ఇదే

- గ్రంథస్థం కాని ఇనుగుర్తి చరిత్ర
- చెత్తకుప్పను తలపిస్తున్న నాటి ఆధారాలు

చరిత్ర


ఇనుగుర్తి గుట్టపైనున్న లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం

మహబూబాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాలగర్భంలో కలిసిపోయిన ఒక 'నగర' చరిత్ర ఇది. 12 శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్యంలోని సామంత రాజులైన నతవాడి వంశస్థులు రాజధానిగా పరిపాలన కొనసాగించారు. నాటి రాజరికపు పరిపాలనకు సజీవసాక్ష్యాలుగా గ్రామంలో ధ్వంసమైన రాతిశిల్పాలు నిలుస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో కొద్దికాలం కిందటే మండల కేంద్రంగా గుర్తింపు పొందిన ఇనుగుర్తి గ్రామం ఇది. ఈ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ అద్భుతమైన శిల్పాలు సాక్షాత్కరిస్తుంటాయి. కాకతీయుల కళాపిపాసకు నిలుస్తున్న ఓరుగల్లు వేయిస్తంభాల గుడి, ములుగు రామప్ప దేవాలయాలకు ఉపయోగించిన రాళ్లతో చేసిన శిల్పాల శకలాలు అనేకం ఇనుగుర్తిలో ఉన్నాయి. కాకతీయుల చరిత్రలో ఇనుగుర్తి పాత్ర ఏంటనేది ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఈ విషయంలో 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారం మేరకు కాకతీయుల కాలంలో 'నగరం'గా.. ఇనుగుర్తి ప్రాశస్త్యం పొందింది.

రెండు గుడుల 'ఇనుగుర్తి'

11వ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో గొప్ప సామ్రాజ్యమైన కాకతీయుల అవశేషాలు ఈ గ్రామంలో ఉన్నాయి. ఇనుగుర్తి అనే పదం 'ఇను గుడి' అనే పదం నుంచి వచ్చింది. ఇనుగుడి అంటే రెండు గుడులు అని అర్థం. 11వ శతాబ్దంలో ఇక్కడ రెండు గుళ్లుండేవని, గ్రామంలోని గుట్టపై లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, గుట్టకింద మరో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, గణపతిదేవ చక్రవర్తి సోదరి మైలమ భర్త రుద్రుడు 1206లో ఇక్కడ శివాలయాన్ని కట్టించినట్టు శాసనం ద్వారా తెలుస్తోంది. గుట్టకుపైన జలంధరభైరవ విగ్రహం చెక్కబడి ఉంది. దాని పక్కనే యాదవరాజుల నిలువెత్తు విగ్రహాలున్నాయి. ఇవి కాకతీయుల అనంతరం యాదవుల పాలనా కాలంలో చెక్కబడి ఉంటాయని తెలుస్తోంది. ఈ విగ్రహాలను 50 ఏళ్ల క్రితం మాదవరావు కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఇక్కడ్నుంచి తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనంతరం గొల్లరాజుల విగ్రహాలతో గుడిని నిర్మించారు.

కాకతీయులతో వైవాహిక సంబంధాలు..

ఇనుగుర్తిని పాలించిన నతవాడీ వంశస్థులు తొలుత చాళుక్యులకు ఆ తర్వాత కాకతీయులకు విదేయ సామంతులుగా వైవాహిక సంబంధాలు కలిగి ఉన్నారట. వీరెప్పుడూ స్వతంత్రరాజ్యాలను స్థాపించేందుకు యత్నించలేదు. నతవాడీ వంశంలో ఆద్యుడు నతవాడీ బేతరాజు, ఆయన కుమారుడు దుర్గరాజు కాకతి ప్రోలమదేవిని వివాహం చేసుకోగా, కూతురు కుప్పాంబికను కాకతి ప్రోలరాజుకు ఇచ్చి వివాహం జరిపించారు. ఇక దుర్గరాజు కొడుకు బుద్దరాజు, ఆయన కొడుకు రుద్రసేనాని. కాకతీయ రాజు మహదేవుడి కూతురు, గణపతిదేవుని సోదరి మైలమను నతవాడీ రుద్రసేనానికి ఇచ్చి వివాహం చేశారని చరిత్ర చెబుతోంది.



ఇనుగుర్తి స్కూల్ ఆవరణలో కాకతీయుల పాలనకు సాక్ష్యంగా నిలుస్తున్న నంది

ఇనుగుర్తే కేంద్ర పట్టణం..

నతవాడీ వంశం మొదట ఖమ్మం జిల్లాలోని మేడిపల్లిని కేంద్రంగా చేసుకుని సామంత రాజ్యాన్ని పాలించారు. ఆ తర్వాత కాకతి గణపతి దేవుని కాలంలో వీరు తమ రాజధానిని ఇనుగుర్తికి మార్చుకున్నారు. ఈ వంశీయులు 1104 నుంచి 1269 వరకు పాలించినట్లు శాసనాధారాలున్నాయి. వీరి శాసనాలను నిడిగొండ, కుందవరం, నర్సంపేట, త్రిపురాంతకం, బయ్యారం, ద్రాక్షారామం, సింహాచలం ప్రాంతాల్లో చరిత్రకారులు గుర్తించారు. అప్పట్లోనే ఇక్కడ కాకతి ప్రోలరాజు 1117లో తవ్వించిన గుంటి చెరువు ఉంది. ఈ చెరువు వద్ద కాకతీయుల నాటి శిల్పాలు ఎన్నో ఉండేవి. వరంగల్ కోటలోని గుంటి చెరువులో నిమ్మకాయ వేస్తే ఆ నిమ్మకాయ గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ ద్వారా కల్లెడ, బూరుగుమళ్ల ప్రాంతాల మీదుగా ఉన్న చెరువులను కలుపుతూ 'రాజుకాల్వ' నుంచి ఇనుగుర్తి గుంటిచెరువులో తేలేదని పూర్వీకులు చెబుతుంటారు. కాకతీయుల అద్భుత నీటి పారుదల వ్యవస్థకు ఇదో నిదర్శనం. గుంటి చెరువు మధ్యలో కాకతీయులనాటి శిల్పాలతో చేసిన ఉయ్యాలలు ఉన్నాయి. అయితే ఇవి చెరువు పూర్తిగా ఎండిపోతేనే కనిపిస్తాయి.



వృథాగా పడి ఉన్న అమూల్య శిల్ప సంపద...

హైస్కూల్ ఉన్న ప్రాంతంలో నాలుగు బురుజులతో కోట ఉండేదని, అందులో మూడు ధ్వంసమై కనుమరుగు కాగా ఒక బురుజు శిథిలావస్థలో ఉంది. 1952లో హైస్కూల్ భవన నిర్మాణం సందర్భంగా చేసిన తవ్వకాల్లో చాలా శిల్పాలు బయటపడ్డాయి. బ్రహ్మంగారి గుడికి వెళ్లే వీధిలో నిర్లక్ష్యంగా పడి ఒక నంది విగ్రహం ఉండేది. ఆ నంది విగ్రహాన్ని గుప్తనిధుల కోసం దుండగులు ధ్వంసం చేశారు. 2001లో నంది విగ్రహానికి మరమ్మతులు చేసి జడ్పీ హైస్కూల్ ఆవరణలో నెలకొల్పారు. శివాలయానికి సంబంధించిన శిలాశాసనం లభించగా, దాన్ని నందిపక్కనే ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం పాతవేదిక కూల్చి కొత్తది నిర్మించే సమయంలో వేదికకు అమర్చిన శిల్పాలు హైస్కూల్ గేటు వెంట పడేశారు. ఇప్పటికీ అక్కడక్కడా శిల్పాల భాగాలు కనిపిస్తాయి. ఈ శిల్పాల అవశేషాలను భద్రపర్చాలని పలువురు కోరుతున్నారు. ఇనుగుర్తిలో కాకతీయులకాలంలో ఏం ఉండేదనేది మిస్టరీగానే మిగిలింది. కాకతీయులతో ఇంతగా ముడిపడి ఉన్న ఇనుగుర్తిని పాలకులు చరిత్రకెక్కించడంలో విస్మరించారని గ్రామస్థులు వాపోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ చరిత్ర మరుగున పడగా తెలంగాణ రాష్ట్రంలోనైనా గ్రంథాల్లోకి ఎక్కుతుందా అని గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా కాకతీయుల చరిత్రలో ఇనుగుర్తి పాత్ర ఏమిటనేది పరిశోధించి ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

కళ


సీనియర్ నటుడు వీకే నరేశ్‌తో ఓ సీరియల్ సన్నివేశ చిత్రీకరణలో మారబోయిన స్వప్న (ఫైల్)

అడవి నుంచి రంగుల ప్రపంచంలోకి..

- వెండితెర, బుల్లితెరపై రాణిస్తున్న మాజీ నక్సలైట్ స్వప్న



మంగపేట, అక్టోబరు, 22:(ఆంధ్రజ్యోతి) : ఆమె ఓ మాజీ నక్సలైట్. చిన్న వయసులోనే పోరుబాట పట్టి అజ్ఞాత దళాల్లో ఐదేళ్ల పాటు పనిచేసి తుపాకీ చేతపట్టి అడవుల్లో తిరిగింది. ఆ తర్వాత ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో జనజీవన స్రవంతిలో కలిసి ఇప్పుడు పలు సినిమాలు, సీరియళ్లలో నటిస్తూ రంగులప్రపంచంలో రాణిస్తూ ఔరా అనిపించుకుంటోంది ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరుకు చెందిన మారబోయిన స్వప్న. సీపీఐ(ఎంఎల్) ప్రజాప్రతిఘటనలో పని చేసిన స్వప్న 2005లో ఖమ్మం డీఎస్పీ ఎదుట లొంగిపోయి జనజీవనస్రవంతిలో కలిసి నాడు ప్రభుత్వం నుంచి రూ.50వేల నగదు పారితోషికాన్ని పొందింది. ఆ తర్వాత పెళ్లి చేసుకున్న ఆమె అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. కానీ కష్టాలకు కుంగిపోకుండా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి తెలుగుదేశం మహిళ విభాగం మండల అధ్యక్షురాలిగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేసింది. మారిన పరిస్థితుల దృష్ట్యా సాంకేతికంగా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సోషల్‌మీడియా వేదికగా టిక్‌టాక్‌లో 'స్మైలీస్వప్న'గా తన చిన్నచిన్న వీడియోలతో నటనలో ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఈ క్రమంలోనే ఓ మిత్రుడి సహకారంతో టెలివిజన్ రంగంలోకి వెళ్లగా క్రమంగా పలు సీరియళ్లలో నటిగా అవకాశాలు పొందింది. ఇటీవల ఓ సినిమాలో హీరోయిన్ తల్లిగా కూడా నటిస్తున్న ఆమె మరో రెండు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ఒకప్పుడు తుపాకీ పట్టి అడవిలో తిరిగిన ఆమె.. జనజీవనస్రవంతిలో కలిసి రాజకీయ నాయకురాలిగా మారి.. ఇప్పుడు వెండితెర, బుల్లితెరపై నటిగా ఎదుగుతున్నారు.

ఎంపిక



జాతీయస్థాయి యోగా పోటీలకు అభినవ నేతాజీ

శంభునిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లో జర గనున్న 49వ జాతీయస్థాయి యోగా పోటీలకు నగరంలోని రంగశాయిపేటకు చెందిన అభినవ నేతాజీ ఎంపికైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా యోగా అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరులో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో 16-18 ఏళ్ల విభాగంలో అభినవ నేతాజీ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

అక్టోబరు 24 నుంచి 27వరకు హిమాచల్ ప్రదేశ్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొననున్నాడు. యోగా అసోసియే షన్ బాధ్యులు, పలువురు ప్రముఖులు అభినవ నేతాజీని అభినందించారు.

నేడు ఓరుగల్లు కళాకారుల ప్రేరణ

- తొలి నృత్యరూప ప్రదర్శనకు శ్రీకారం
- హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శన

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలంనాడు యుద్ధరంగానికి వెళ్లే సైనికులకు వీరరసం ప్రబోధింపజేసే పేరిణి శివ తాండవం స్థానంలో ఓరుగల్లు కళాకారులు, పేరిణి నాట్యాచార్యులు గజ్జెల రంజిత్‌కుమార్ - నవ్యజ ఆధ్వర్యంలో అద్వితీయ ప్రేరణ నృత్యరూపకాన్ని రూపొందించారు. గంటన్నర నిడివితో సుమారు 45 మంది కళాకారులతో రిటైర్డ్ తెలుగు పండిట్ డాక్టర్ పురుషోత్తమాచార్య రచించిన ప్రేరణ నృత్యరూపక ప్రదర్శనకు బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా నిలువనుంది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో వరంగల్‌లోని నటరాజ కళాకృష్ణ, నృత్యజ్యోతి అకాడమీ సమర్పణలో అనేకమంది ప్రముఖుల సమక్షంలో ఈ నృత్యరూపకం ప్రదర్శనకు సిద్ధమైంది. రాష్ట్ర టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, తదితర అనేకమంది ప్రముఖుల సమక్షంలో ప్రేరణ తొలి ప్రదర్శనను నిర్వహించనున్నారు.

కాకతీయుల కాలంలో గొప్పగా ఆదరణకు నోచుకున్న ప్రేరిణి స్థానంలో ఆధ్యాత్మిక అనుభూతితో పాటు శక్తివంతమైన రౌద్రపరమైన, ముఖ్యంగా నేటి మహిళాలోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచేలా ప్రేరణ నృత్యరూపకాన్ని ప్రదర్శించనున్నారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ ఆలోచనలకు ప్రతిరూపకంగా సుమారు మూడేళ్ల కృషి ఫలితంగా అన్ని హంగులతో డాక్టర్ రంజిత్‌కుమార్ - నవ్యజ దంపతులు ఈ ప్రదర్శనకు శ్రీకారం చుట్టనున్నారు. ఇటీవల కాలంలో ముష్కరులచేతిలో దాడికి గురైన నిర్భయ యథార్థ సంఘటన నేపథ్యంలో మాళవిక పాత్రద్వారా ఈ నృత్య రూపకంలో మహిళలు ఎలాంటి అరాచక సంఘటనలైనా నిర్భయంగా ఎదుర్కొనేలా సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక మేళవింపులతో కాకతీయ వారసత్వ పేరిణికి ప్రతిరూపకంగా ప్రేరణ నృత్యం నిలిచేలా రూపొందింప చేయడం విశేషం. తొలి ప్రదర్శన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ముఖ్య పట్టణాలలోనూ ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రేరణ నృత్యరూపకాన్ని ప్రదర్శించేందుకు చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందింప చేశారు. కాకతీయ గణపతి దేవుడి ఆరాధన నృత్యంతో పాటు సామాజిక అంశాల ఇతివృత్తంతో ప్రేరణ రూపొందింప చేశారు. రాయబారపు శ్రవణ్‌రాజ్ ఈ బ్యాలేకు సంగీతాన్ని రూపొందింప చేశారు.

ఈ నృత్యంలో ఓరుగల్లుకు చెందిన పల్నాటి శ్రీజ, వైష్ణవి, తేజస్విని, గడ్డం విద్యశ్రీ, బైరి వందన, సూరం శ్రేయారెడ్డి, ప్రజ్ఞా, ఎం.లోహిత్, టి.గురుదేవ్, వడ్నాల ప్రశాంత్, సాయికపిలతేజ, రేగుల చందు తదితర అనేక మంది ఓరుగల్లు కళాకారుల ప్రతిభ జాతీయ స్థాయి వేదికలపైన కూడా గుబాళించేలా రూపొందింపచేశారు. ఓరుగల్లు నుంచి ఈ ప్రదర్శనకు ప్రముఖులు తరలి వెళ్లనున్నారు.


ప్రేరణ నృత్యరూపకంలో పాల్గొనే కళాకారులు వీరే..


సినిమా వివరాలు వెల్లడిస్తున్న హీరో, హీరోయిన్లు అనన్య, యువ చంద్రశేఖర్

ఓరుగల్లులో పొట్టేలు సందడి

- స్టెప్పులేసిన హీరో, యువ చంద్రశేఖర్


డ్యాన్స్ చేస్తున్న సినీ హీరో యువ చంద్రశేఖర్

కాశిబుగ్గ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో పొట్టేలు సినిమా తారలు మంగళవారం సందడి చేశారు. ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతున్న సందర్భంగా వెంకట్రామ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సినిమా యూనిట్ పాల్గొన్నారు. డప్పుచప్పుళ్లకు యువ హీరో స్టెప్పులేసి ఉత్సాహపర్చారు. అనంతరం హీరో, హీరోయిన్లు యువ చంద్రశేఖర్, అనన్య నాగళ్ల సినిమా వివరాలను వెల్లడించారు. మంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విజయవంతంగా సినిమా నిర్మాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సినిమా తప్పకుండా ప్రజల ఆదరణ పొందుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగాలు వదులుకొని ఈ సినిమా చేసినట్లు వివరించారు. కార్యక్రమానికి హాజరైన వారు హీరో, హీరోయిన్లతో ఫొటోలు దిగడానికి ఆసక్తి కనబర్చారు.

మీ కోసం..



తపాలా బీమా.. అందరికీ అండగా..

తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజీ • సద్వినియోగం చేసుకోవాలంటూ విస్తృత ప్రచారం

వర్దన్నపేట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనుకోని ప్రమాదాల్లో ఎవరైన చనిపోతే వారిపై ఆధారపడిన ఆ కుటుంబాల పరిస్థితి దయనీయం. పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో అందరికీ అండగా ఉండేలా తపాలా శాఖ తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ ప్రయోజనం చేకూరేలా ప్రమాద బీమా పథకాలను అందుబాటులోకి తెచ్చింది. రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు ప్రయోజనం అందేలా హెల్త్‌ప్లస్, ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రవేశపెట్టింది. వీటిని సద్వినియోగం చేసుకుంటే తమపై ఆధారపడిన కుటుంబాలకు అండగా ఉండొచ్చంటూ తపాలాశాఖ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

బీమా సదుపాయాలు..

నివా హెల్త్ ఇన్సూరెన్స్, తపాలా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తక్కువ ప్రీమియంతో రూ. 10లక్షల రూ.15లక్షల ప్రమాద బీమా అందిస్తోంది. 18 నుంచి 65 ఏళ్ల లోపు వారు ఈ పథకానికి అర్హులు. ఏడాదికి ఒకేసారి రూ.549 ప్రీమియంతో రూ. 10లక్షలు, రూ.749 ప్రీమియంతో రూ.15 లక్షల ప్రయోజనం పొందవచ్చు. పాలసీదారు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భాల్లో మాత్రమే వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులకు ఈ బీమా ప్రయోజనం అందుతుంది. ఇన్‌ష్యూర్డ్ వ్యక్తికి సమగ్ర ప్లాన్, శాశ్వత పూర్తి వైకల్యం(పీటీడీ నుండి రక్షణ), శాశ్వత పాక్షిత వైకల్యం(పీటీడీ) నుండి రక్షణ, బర్న్ బెనిఫెట్, పిల్లల విద్యకు నిధులు లాంటి సదుపాయాలున్నాయి.

మరెన్నో ప్రయోజనాలు...

తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న హెల్త్ ప్లస్, ఎక్స్‌ప్రెస్ ఇన్సూరెన్స్ స్కీంలతో పాటు ప్రమాదవశాత్తు మృతిచెందినా, ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం కలిగినా, కాలు, చేయి కోల్పోయినా, పక్షవాతం సంభవించినా బీమా డబ్బు మొత్తం చెల్లిస్తారు. అలాగే పాలసీ గడువు కాలంలో ఒకసారి ఆరోగ్య తనిఖీ, అపరిమిత టెలీ కన్సల్టెన్సీ ప్రయోజనాలు పొందవచ్చు. యాక్సిడెంటల్‌లో చనిపోయినా, శాశ్వత వైకల్యమైనా, పక్షవాతం వచ్చినా రూ.10 లక్షల నుంచి రూ.15లక్షలు చెల్లిస్తారు. ఇక వైద్యఖర్చులు అవసరమైన వారికి రూ.30వేలు, యాక్సిడెంటల్ ఇన్ పేషంట్ రూ.60వేలు, విద్య ప్రయోజనం గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు రూ.లక్ష, కోమటోస్ బెనిఫిట్ రూ.లక్ష, కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.25 వేలు, అంత్యక్రియల ప్రయోజనం రూ.5వేలు, విరిగిన ఎముకలకు చికిత్స కోసం రూ.లక్ష, న్యూట్రీషనల్, మానసిక ఆరోగ్యం కోసం కన్సల్టెంట్, అన్‌లిమిటెడ్ టెలీకన్సల్టెన్సీ-ఓపీడీ సౌకర్యాలున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి...

- లావురి సైదా నాయక్, సబ్‌డివిజన్ ఇన్స్‌పెక్టర్, వరంగల్



ఆదిత్య బిర్లా కాపిటల్ హెల్త్ ఇన్సూరెన్స్, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో హెల్త్ ప్లస్, ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రీమియం ప్రారంభించిన 15రోజుల తర్వాత నుంచి బీమా వర్తిస్తుంది. పాలసీదారుడు మృతిచెందితే ఎఫ్ఐఆర్ కాపీ, ఇతర ధ్రువపత్రాలతో క్లెయిమ్ చేసుకున్న నెలరోజుల్లో బీమా ప్రయోజనం అందుతుంది. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

సూది మందు .. ఆస్పత్రులకే ఇవ్వాలి ముందు

బయ్యారం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత



బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బయ్యారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ ఆస్పత్రులు పేదల పాలిట కల్పతరువు లాంటివి.. కాని వాటికే వైద్యం చేయాల్సిన పరిస్థితి ఉంది. బయ్యారం ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది సమస్యలకు అసంపూర్ణంగా ఉండడంతో పీహెచ్‌సీకి వచ్చే రోగు లు అవస్థలు పడుతున్నారు.. వైద్యుడితో సహా పలు ప్రధాన పోస్టులన్ని ఖాళీగా ఉండడంతో 24 గంటల ఆస్పత్రి అలంకారప్రాయమైంది.. రక్త పరీక్షలు చేసి మందులు ఇచ్చే వారు కూడా కానరాక పోవడం రోగుల పాలిట శాపంగా మారింది.. వైద్యుడితో సహా 3 స్టాఫ్‌నర్సు, 3 సూపర్‌వైజర్, ఒక ల్యాబ్ టెక్నీషన్, ఒక ఫార్మసిస్టు పోస్టులున్నాయి. ఫీల్డ్ లెవల్‌లో 8 హెల్త్ సబ్ సెంటర్లకు కలిపి 16 ఏఎన్ ఎం పోస్టులున్నాయి. పీహెచ్‌సీ పరిధిలో హెడ్ క్వార్టర్, ఫీల్డ్ లెవల్ నందు 25 పోస్టులుండగా.. ప్రస్తుతం 14 పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం.

ఏఎన్‌ఎంలు తప్పా అన్నీ ఖాళీలే..!

బయ్యారం పీహెచ్‌సీలో వైద్యాధికారి పోస్టు చాలాకాలంగా ఖాళీగా ఉండటంతో కంబాలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న సాగర్ ఏడాది క్రితం డిప్యూటేషన్‌పై వచ్చి బయ్యారం పీహెచ్‌సీ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం జరిగిన బదిలీల ద్వారా పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషన్, ఫార్మసిస్టుతో పాటు మూడు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. మూడు సూపర్ వైజర్ పోస్టులకు గాను కేవలం ఒకే ఒక్క సూపర్‌వైజర్ పనిచేస్తుండగా.. మిగిలిన రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు ఫీల్డ్ లెవల్‌లో 8 హెల్త్ సబ్ సెంటర్ల పరిధిలో మొత్తం 16 మంది ఏఎన్‌ఎంలు పనిచేయాల్సి ఉండగా.. 10 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో 6 ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం మీద హెడ్ క్వార్టర్, ఫీల్డ్ లెవల్‌లో కలుపుకొని 25 మంది వైద్య సిబ్బంది పనిచేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 11 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అందులోను 10 మంది ఏఎన్‌ఎంలే కావడం గమనార్హం. కాగా ప్రధాన పోస్టులతో కలుపుకొని 14 పోస్టులు ఖాళీలుగా దర్శన మిస్తుండటంతో సరైన వైద్యం అందక రోగులు అవస్థలు పడుతున్నారు. ల్యాబ్ టెక్నీషన్ పోస్టు ఖాళీ ఏర్పడటంతో పలు రకాల రక్త పరీక్షలు చేయించుకునే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రెగ్యులర్‌గా చెక్ చేసుకునే షుగర్ పేషంట్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు గర్భిణీ, లివర్, కిడ్నీ రోగులు కూడా రక్త పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇకపోతే ఫార్మసిస్టు లేకపోవడంతో మందుల సమస్య తలెత్తుతుంది. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎవరో ఒక్కరు మందులు ఇస్తున్నప్పటికి స్టాక్ ఇండెంట్ పెట్టాలంటే ఏ మందులు ఉన్నా యో.. ఏ మందులు అయిపోయాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. అంతేకాక గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల బాగోగులు తెలుసుకునే ఏఎన్‌ఎంల కొరతతో క్షేత్ర స్థాయిలో కూడా వైద్య సేవలు కుంటు పడినట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బయ్యారం పీహెచ్‌సీ పరిధిలో మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు చేపట్టాలని, వెంటనే కొత్త సిబ్బందిని నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కారుణ్య నియమకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న బలాష్టి రమేష్

కురవి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మృతి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బలాష్టి రమేష్ అన్నారు. కురవి మండలం మోద్గులగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నేరవేర్చకపోవడం వల్ల ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. మండల అధ్యక్షులు గుండ్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఓదేల శివకుమార్, సబ్ కమిటీ సభ్యులు సీహెచ్.శ్రీనివాస్, గుగులోతు వెంకన్న పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మునిసిపల్ కార్మికులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న జరుపతలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ అనుబంధ మునిసిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న అన్నారు. మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహబూబాబాద్‌లో మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తోట శ్రీను, చిరంజీవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● తొర్రూరు : మునిసిపల్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యూలర్ చేయాలని కోరుతూ మంగళవారం తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ శాంతి కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము దేవేందర్ మాట్లాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, సాంబయ్య, యాకన్న, వెంకటరాంనర్సయ్య, సోమన్న, శంకర్, నర్సమ్మ, చంద్రమ్మ, బిక్షపతి తదితరులు ఉన్నారు.

విద్యావ్యతిరేక విధానాలపె పోరాడాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సంఘంటితంగా పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కాంపాటి పృథ్వీ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని సీపీఐ ఎం.ఎల్ (ప్రజాపంథా) పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీ గ్రూపు-1 ఉద్యోగాలకు ప్రధానంగా అడ్డంకిగా మారిన జీవో 29ను తక్షణమే రద్దు చేయాలన్నారు. జీవో నెంబరు 55 ప్రకారం నియామకాలు చేపట్టాలన్నారు. అనంతరం 13 మంది సభ్యులతో జిల్లా కమిటీతో పాటు మరో 8 మందిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఉన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉదయ్, నందీశ్వర్, గౌతం, రాంచరణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టం సర్వే అవకతవకలపై రైతుల నిరసన

నెల్లికుదురు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రాజులకొత్తపల్లిలో చెరువు గండిపడి రైతుల పొలాలు కొట్టుకపోయాయని, పంటనష్టం సర్వేలో అవకతవకలు జరిగాయని మంగళవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. పంటనష్టం సర్వేలో అధికారులు అవకతవకలకు పాల్పడడంతో అర్హులైన బాధిత రైతులకు నష్టపరిహారం అందలేదన్నారు. గ్రామపంచాయతీవద్ద రైతులు మళ్లీ సర్వే నిర్వహించి నష్టపరిహారం వచ్చేవిధంగా అధికారులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మోడెం నర్సయ్య, చీనూరి మధుకర్, మహేష్, ప్రవీన్, సోమయ్య, సంతోష్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

బయ్యారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పలు పంటలను మంగళవారం కేవీకే మల్యాల శాస్త్రవేత్తలు మాలతి, క్రాంతి కుమార్‌లు పరిశీలించారు. మండలంలోని సింగారం గ్రామంలో రైతులు రాంబాబు, భీముడు సాగుచేస్తున్న మిర్చి, మొక్కజొన్న పంటలను వారు పరిశీలించిన పలు సలహాలు, సూచనలు చేశారు. మిర్చి పంటకు సోకే నల్లి, కింది, పై ముడత, మసిపేను నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రాంజీ నాయక్‌తో పాటు శ్రీను, గోపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థినులకు కంటి పరీక్షలు

ఇనుగుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో నేత్రవైద్యనిపుణుడు డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలున్నవారికి కళ్లద్దాలను అందజేసి ఆపరేషన్ అవసరం ఉన్నవారిని జిల్లా ఆస్పత్రికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.ఆశ, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ కె.శివరాం, ఎం.సునీల్, ఏఎన్‌ఎంలు కె.సుమలత, హేమలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బయ్యారంలో జూట్ బ్యాగ్‌ల ఆవిష్కరణ..



బయ్యారంలో జూట్ బ్యాగ్స్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

బయ్యారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. పర్యావరనాన్ని రక్షిద్దామంటూ బయ్యా రంలో మంగళ వారం జూట్ బ్యాగ్స్ (సంచులు) లను ఆవిష రించారు. బయ్యారం మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకులు గుగులోత్ కిషన్ నాయక్ పర్యావరణ హితకై ఇటీవల 5 వేలు జూట్ బ్యాగ్స్ కుట్టించాడు. అయితె ఈ బ్యాగులను స్థానిక పీహెచ్‌సీ నందు వైద్యాధికారులు రాజ్‌కుమార్ జాదవ్, సాగర్‌లతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు. కాగా బ్యాగ్స్‌పై పర్యావరణ పరిరక్షణ..! సర్వజన సంరక్షణ..!! చెట్లు నాటితే క్షేమం..! చెట్లు నరికితే క్షామం..!! అంటూ ముద్రించారు. పలువురికి అవగాహన కల్పించారు.

దళిత, గిరిజన, పీడిత ప్రజల ఆశాజ్యోతి శంకరన్



శంకరన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, పీడిత ప్రజల ఆశాజ్యోతి ఐఏఎస్ అధికారి ఎస్ఆర్. శంకరన్ అని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గిరిజన సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవాఆరం ఐఏఎస్ అధికారి దివంగత ఎస్ఆర్ శంకరన్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంమూర్తి మామిడాల సత్యనారాయణ, శ్రీధర్, వట్టం భాగ్యమ్మ, సంపంగి రాంచంద్రు, మోహన్‌నాయక్, వాసం ఆనంద్, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

● గూడూరు : గూడూరు మండలం మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎస్ఆర్.శంకరన్ 90వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మోకాళ్ల వెంకన్న, చుంచ బాలయ్య, జగ్గయ్య, రఘు, శిరీష, వసంత తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలి

కొత్తగూడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ గుంజేడు రోడ్డులో శ్రీసీతారామాలయం నిర్మించుకునేందుకు స్థలం మంజూరు చేయాలని పంచాయితీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను సీతరామాలయ సాధన సమితి సభ్యులు కోరారు. మంగళవారం ములుగులో మంత్రి సీతక్కతో సీతరామాలయ సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ.. కొత్తగూడలోని గుంజేడు రోడ్డులో అక్టోబరు 13న సీతారాములు నూతనంగా వెలిసారని తెలిపారు. నాటి నుంచి సీతారాములను దర్శించుకునేందుకు మండలంలోని గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారని తెలిపారు. సీతారాములు వెలసిన స్థలంలో గుడి నిర్మించుకునేందుకు స్థలం మంజూరు చేయాలని సీతరామాలయ సాధన సమితి సభ్యులు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో చర్చించి స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.



మంత్రి సీతక్కతో సీతారామాలయ సాధన సమితి సభ్యులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన



ప్లాట్లను పరిశీలించి ఆన్‌లైన్ నమోదు చేసున్న అధికారులు.

దంతాలపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లే అవుట్ రెగ్యులైరేషన్ స్కీం కింద ఇటీవల చేసుకున్న దరఖాస్తులను అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా దంతాలపల్లి ప్రత్యేక అధికారి రాజేశ్వర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పలు దరఖాస్తులతో ప్లాట్లను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదుకు శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలో ఏలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్న, గిర్దావర్ నజీముద్దిన్, ఏఈ వెంకటేశం పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

పెద్దవంగర, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములుగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పోచంపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచ దేశాల సరసన ఆగ్రగామిగా నిలబడిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోమ్మరబోయిన సుధాకర్, రాంపెల్లి హరీష్, అనంద్, యాకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

32 మూల మలుపులు



కేసముద్రం నుంచి కల్వల, తాళ్లపూసపల్లి మీదుగా మహబూబాబాద్ వెళ్లే రహదారి 32 మూలమలుపులతో ప్రమాదభరితంగా ఉంది. 17 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ మార్గంలో ఇనుగుర్తి కేసముద్రం మీదుగా మహబూబాబాద్‌కు నిత్యం ఆర్టీసీ బస్సుతోపాటు వందలాది వాహనాలపై ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దశాబ్ధాల క్రితం ఏర్పడిన ఎడ్లబండ్లు నడిచే డొంక దారినే రోడ్డు మార్గంగా అభివృద్ధి చేసుకుంటూ వెళ్లడంతో మూలమలుపులు అనేకంగా అలాగే ఉన్నాయి. డబుల్ బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్న క్రమంలో అప్పటి ప్రజాప్రతినిధులు మూల మలుపులను సరిచేసి నిర్మించాలని ప్రయత్నాలు సైతం చేసినప్పటికీ ఆచరణ మాత్రం కాలేదు. మూలమలుపుల వద్ద రోడ్డును మరింత వెడల్పు చేసి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అలాగే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. - కేసముద్రం

అస్తిత్వ ఉద్యమాల వేగుచుక్క కొమురం భీం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమరం భీం భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం నిజాం నవాబును ఎదురించి పోరాడారని భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మంగళవారం కొమరంభీం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తండా సదానందం, కొమిరె ఉప్పలయ్య, సోమ గోవర్ధన్, సైదులురెడ్డి, కాపరబోయిన శ్రీనివాస్, మాలోతు బావుసింగ్, అవునూరి రవి, దరావత్ వీరన్న పాల్గొన్నారు.

కాళోజీ వాకర్స్ ఆధ్వర్యంలో..

జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీ, గిరిజనుల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేసిన యోధులు కొమరంభీం అని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు మైన శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆదివాసీ హక్కుల పోరాట యోధులు కొమరంభీం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, సోమ విష్ణువర్ధన్, దేవేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీనివవాస్‌రెడ్డి, వేముల రవీందర్, వెంకట్, పగడయ్య, రవి, రాజన్న, నాగేశ్వర్‌రావు, పరమేశ్వర్, వెంకన్న, భద్రు, నరేష్, ఉమేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

●ం బయ్యారం : కొమురం భీం ఆదివాసీల ఆశాజ్యోతి అని కొత్తపేట మాజీ సర్పంచ్ ఇర్ప మమత పేర్కొన్నారు. కొమురం భీం 123వ జయంతిని మంగళవారం మండలంలోని బయ్యారం, కొత్తపేట గ్రామాలలో జరుపుకున్నారు. కుమ్రం భీం విగ్రహాలకు ఆదివాసీలు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పుల్లయ్య, వెంకటేశ్, బిక్షం, రాజేష్, సురేష్, ప్రకాశ్, పాపారావు, రామారావు, సంపత్, భద్రయ్య, వినోద, రమ, నర్సమ్మ, చుక్కమ్మ, సాంబశివరావు, రత్నాకర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో కొమురం భీంచిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ బాధ్యులు

మూడు పాఠశాలల్లో తనిఖీలు

న్యూస్ బాక్స్

కేసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకట్రాంతండా, కల్వల ప్రాథమిక, నారాయణపురం ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం ఎంఈవో కాలేరు యాదగిరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి, విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు.

బొలేరో, ద్విచక్రవాహనం ఢీ.. ఇద్దరికి గాయాలు

నెల్లికుదురు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బొలెరో వాహనం స్కూటీని ఢీ కొట్టడంతో ఇద్దరి తీవ్రగాయాలైన సంఘటన మండంలోని ఆలేరు రైతు వేదిక వద్ద మంగళవారం జరిగింది. ఎస్సై సీహెచ్ రమేష్‌బాబు కథనం ప్రకారం ఆలేరు గ్రామానికి చెందిన కోరె హరీష్ తన తండ్రి బీరయ్య ఆలేరు స్టేజీనుంచి తమ ఇంటికి స్కూటీపై వెళుతున్నారు. ఈ క్రమంలో ఆలేరు నుంచి స్టేజీ వైపు వస్తున్న బొలేరో వాహనం అతి వేగంతో స్కూటీని ఢీకొట్టడంతో హరీష్‌తో పాటు తనతండ్రి బీరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో మహబూ బాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కోరె బీరయ్య పెద్ద కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు అతివేగంతో ప్రమాదానికి కారకుడైన గ్రీన్‌ఫీల్డ్ హైవేలో పనిచేస్తున్న ఓ కంపెనీకి చెందిన బవనాసి జమదగ్నిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

నేడే బీసీ రాజ్యాధికార సమితి సమావేశం

గూడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండల కేంద్రంలో నేడు బుధవారం బీసీ రాజ్యాధికార సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర, జిల్లా బాధ్యులు పెదకాసు కుమారస్వామి, కట్ల విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కులాలకు చెందిన నాయకులు ఈ సమావేశంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలిపారు.

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఉపేందర్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన బోనగిరి ఉపేందర్ నియామకమయ్యారు. మహబూబాబాద్ పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సంఘం జిల్లా కార్యదర్శిగా బోనగిరి ఉపేందర్‌ను నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగు తున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఉపేందర్, నిరంజన్, క్రిష్ణ, దయాకర్ పాల్గొన్నారు.

రైతులు పంట దిగుబడిపై అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట దిగుబడి పొందేందుకు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎఫ్ఎం కన్సల్టెంట్ సారంగం అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేశారు. ఎప్పటికప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండి మందులను పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వాహిని, ఏఈవోలు దీక్షిత్‌కుమార్, శిరిష పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కురవి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం బలపాల లింగ్యాతండాలో మాజీ ఎంపీటీసీ లింగ్యానాయక్ తల్లి కోమటి ఇటీవల మృతి చెందగా డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. కోమటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అదే తండాలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మాలోతు బిచ్యాను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోతు రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

పెద్దవంగర, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 5డీఏలను విడుదల చేయాలని కోరుతూ టీపీయూఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని చిట్యాల ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, యాకయ్య, ఉపాధ్యాయులు రమేష్, కోటేశ్వర్, సురేందర్, శివకుమార్, ప్రభాకర్, యుగేంధర్, మల్లేశం, రాజేందర్, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

● కేసముద్రం : ఉపాధ్యాయులకు ఐదు డీఏలు, పీఆర్‌సీ, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలనే డిమాండ్‌తో కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వోమ సంతోష్, హెచ్ఎం బి.రాజు, గంగుల శ్రీనివాస్, కుమారస్వామి, సత్యనారాయణ, సదయ్య పాల్గొన్నారు.

కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్‌గా భద్రయ్య

గూడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం జిల్లా కన్వీనర్‌గా గూడూరు మండలం పోనుగోడు గ్రామానికి చెందిన మేరుగు భద్రయ్యను నియమించినట్లు ఆ సంఘం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చీమ శ్రీనివాసరావు, సురేందర్‌రెడ్డి, కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి తెలిపారు.

గడి మైసమ్మ తల్లి దేవాలయ కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణ శివారు యాదవనగర్ గడి మైసమ్మ తల్లి దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవనగర్‌లో కాలనీ వాసులంతా సమావేశమై 15 మందితో గడి మైసమ్మ తల్లి దేవాలయ కమిటీని ఎన్నుకున్నారు. ఆలయకమిటీచైర్మన్‌గా మాదరబోయిన యాకయ్య, వైస్‌చైర్మన్‌గా కదారి యాకయ్య, కోశాధికారిగా మాదరబోయిన విజయ్‌కుమార్, సభ్యులుగా ఆకుల సమ్మయ్య, గుంటి కార్తీక్, బండారి ప్రదీప్, వల్లపు మల్లయ్య, గోసుల సమ్మయ్య, బండారి సైదమ్మ, నిమ్మల స్వరూప, కసనబోయిన జ్యోతి, సలహాదారులుగా ఆకుల రాము, మాదరబోయిన శ్రీశైలం, జక్కుల వెంకన్న, జన్నారపు వినయ్ ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులలో వేగం పెంచాలి : కలెక్టర్



డోర్నకల్‌లో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

డోర్నకల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపాలిటీలో టీయుఎఫ్ఐడీసీ నిధుల కింద చేపట్టిన పనులను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. సోమవారం డోర్నకల్ మునిసిపాలిటీలోని గొల్లబజారు, టీచర్స్ కాలనీ, ముత్యాలమ్మగుడి రోడ్డు, భగత్‌సింగ్ విగ్రహం సెంటర్, బతుకమ్మ పార్కులలో మునిసిపల్ కమిషనర్, సిబ్బందితో కలిసి పర్యటించారు. టీయుఎఫ్ఐడీసీ నిధులతో అవసరమున్న చోట పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. మునిసిపాలిటీలో నూరుశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ వీరన్న ఉన్నారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని పలు వసతి గృహాలను జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. ఆపై ఎస్సీ బాలుర వసతిగృహాన్ని సందర్శించి డిజిటల్ లైబ్రేరీ పరిశీలించారు. అనంతరం ఎస్టీ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మెనుపై వార్డెన్ స్వామి అడిగి తెలుసుకున్నారు. ఎస్టీ హాస్టల్ ఆవరణం మొత్తం పరిశుభ్రంగా ఉండడంతో వార్డెన్ స్వామిని అభినందించారు. అనంతరం శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. అదనపు కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.